2వ పాఠం జూలై 3-9

# విశ్రాంతిని నిరాకరించుట

**సబ్బాతు మధ్యాహ్నము** **జూలై 3**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : సంఖ్యా 11:1-15; 12:1-3; 13:27-33; 1కొరింథి 10:1-11.**

**కంఠతవచనం : "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను" (1కొరింథి 10:11).**

ఏదైన ఒక పెద్ద భూకంపము సంభవించకముందు కుక్కలు మరియు ఇతర జంతువులు అసాధారణమైన రీతిలో వింతగా ప్రవర్తిస్తూ ఉంటాయి.

భూమి కంపించుట వలన ఏర్పడే ఒత్తిడిని మనుష్యుల కన్నా జంతువులు ముందుగా గ్రహించగలవని శాస్త్రజ్ఞులు ఇప్పుడు తెలుసుకున్నారు. అందువలననే అవి వింతగా ప్రవర్తిస్తూ ఉంటాయి. పెద్ద భూకంపం సంభవించుటకు ముందు సంభవించే చిన్న ప్రకంపనముల యొక్క శబ్దమును ఏనుగులు వినగలవు గాని మనుష్యులకు అది సాధ్యము కాదు.

ఆగష్టు 23, 2011లో 5.8 తీవ్రత గల భూకంపము వాషింగ్టన్ డి.సి ప్రాంతమున సంభవించినది. అది జరగడానికి కొన్ని నిమిషాల ముందు జాతీయ జంతు ప్రదర్శన శాలలో కొన్ని జంతువులు వింతగా ప్రవర్తించాయి. ఉదాహరణకు కోతుల వలె కనిపించే లీమర్సు అనే జంతువులకు దట్టమైన బొచ్చు మరియు పొడవైన తోక ఉంటుంది. మెడగాస్కర్ ప్రాంతములో అవి చెట్ల మీద నివసిస్తూ ఉంటాయి. ఆ దినమున జంతు ప్రదర్శన శాలలో ఉన్న లీమర్సు భూకంపానికి 15 నిమిషాలముందే చాలా బిగ్గరగా ఏడ్చినవి.

ఈ వారము మనము మానవులలో ఉన్న కొన్ని వింత ప్రవర్తనలను గూర్చి చదువుకొనబోవుచున్నాము. మానవులలో ఆ వింత ప్రవర్తనలు ప్రకృతి విపత్తులు లేక భూకంపములు సంభవించుట వలన కలిగినవి కాదు. పాపము వలన ఆ వింత ప్రవర్తన సంభవించినది. యేసు అనుగ్రహించు విశ్రాంతిని తిరస్కరించుట వలన మనము ఈ వారము పాఠములో చదువుకొనబోవుచున్న వారిలో ఆ వింత ప్రవర్తన ఏర్పడియున్నది. విశ్వాసముతో యేసు వద్దకు వచ్చే వారందరికి ఆయన క్షమాపణను అనుగ్రహించుచున్నాడు.

**ఆదివారం** **జూలై 4**

**ఎడారిలో విశ్రమించుటకు తిరస్కరించెను (సంఖ్యా 11:1-15)**

ఇశ్రాయేలీయులు సీనాయి ప్రాంతమును విడిచి పెట్టినపుడు దుఃఖములో ఉన్నారు.

అప్పటికి వారు ఐగుప్తును విడిచి ఒక సంవత్సరమైంది (సంఖ్యా 1:1) ప్రజలు వాగ్దాన భూమిలో ప్రవేశించాలని ఆశపడుచున్నారు. దేవుడు అనేక అద్భుత కార్యములను వారి మధ్య చేసాడు. అయితే సీనాయిని విడిచినపుడేమి సంభవించింది? సణుగుట ప్రారంభించారు. ఫిర్యాదులు చేస్తున్నారు.

**దేని నిమిత్తము ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు? సంఖ్యా 11:1-15 చదువుడి.**

ఇశ్రాయేలీయులతో కలిసిపోయిన ఇతర జనాంగము ఒక మిశ్రమ వర్గముగా ఏర్పడి ఫిర్యాదులు చేయడం ప్రారంభించారు. వారితో ఇశ్రాయేలీయులు కూడా చేరిపోయి, ఐగుప్తులో వారు తినిన ఆహారము కావాలని ఫిర్యాదు చేస్తున్నారు. వారు ఐగుప్తులో ఉచితముగా తిన్న మాంసాహారమును, చేపలను కీర దోసకాయలను, కూరాకులను, ఉల్లిపాయలను, తెల్లగడ్డలను జ్ఞాపకము చేసుకొని ఇక్కడ ఈ మన్నా తప్ప మాకు వేరొక ఆహారము దొరుకుట లేదని ఏడ్వసాగిరి (సంఖ్యా 11:4-6) వారు ఐగుప్తులో ఎదుర్కొనిన బానిసత్వమును మర్చిపోయి కేవలం ఆహారం మాత్రమే జ్ఞాపకముంచుకొనిరి.

దేవుడు మన్నాతో ఇశ్రాయేలీయులను పోషించుట మొదలు పెట్టి ఒక సంవత్సరము పైనే అయినది. అయితే మన్నాతో సంతోషించుటకు ప్రజలు తిరస్కరించారు. ప్రజలు చేసే ఫిర్యాదులకు మోషే కూడా విసుగుచెందాడు. మోషే చేయుచున్న పని సులభమైనదేమీ కాదు. అయితే ఆయన ఎవరి సహాయము కోరవలసియున్నాడో అతనికి తెలుసు. అవును యేసువైపు చూడాలని మోషేకు తెలుసు. అందుచేతనే యెహోవాతో ఈలాగు మొఱ్ఱ పెట్టుకొనెను "నీవేల నీ సేవకుని బాధించితివి? నా మీద నీ కటాక్షము రానీయక ఈ జనులందరి భారమును నా మీద పెట్టనేల?" (సంఖ్యా 11:11).

**దేవుడు ప్రజలకు ఏవిధముగా జవాబిచ్చాడు? సంఖ్యా 11:11-33 చదువుడి.**

అవును. దేవునికి మన అవసరాలు తెలుసు. ఎప్పుడు విచారముగా వున్నామో అది కూడా ఆయనకు తెలుసు. ఆహారముగా తినుటకు పిట్టలను అనుగ్రహించెను. అయితే ప్రజలకు నిజముగా కావలసింది మాంసాహారము కాదు. మనము కోపముగా ఉన్నపుడు అసలు విషయము ప్రక్కకు పెట్టి వేరొక విషయము అనగా ఒక లోతైన విషయము వారి కోపానికి కారణముగా వెలుగులోనికి వస్తుంది. ఇశ్రాయేలీయులు వారి జీవితాలపై దేవుని యొక్క నాయకత్వమునకు వ్యతిరేకముగా పోరాటము చేయుచున్నారు. ఈ విషయమై మనందరము జాగ్రత్తగా వ్యవహరించవలసియున్నది. ఊహించిన దానికన్నా సులువుగా దేవునికి వ్యతిరేకముగా పోరాడుట అనునది జరుగుచున్నది.

**మన గతము అనుకూలముగా లేకున్నను దానిని సులువుగా ఎందుకు జ్ఞాపకముంచుకుంటాము?**

సోమవారం జూలై 5

## ఒక రోగమువలె పాపము వ్యాపించినపుడు (సంఖ్యా 12:1-3)

**అహరోను మరియు మిర్యాము ఏ విషయములో మోషేకు విరోధముగా మాట్లాడిరి? (సంఖ్యా 12:1-3 చదువుడి).**

మిద్యాను ప్రాంతమునకు చెందిన కూషు దేశపు స్త్రీయైన సిప్పోరా జన్మము ద్వారా ఇశ్రాయేలీయురాలు కాకపోయినను మోషే ఆమెను వివాహము చేసుకొనుట వలన మిర్యాము మరియు అహరోను మోషేను వ్యతిరేకిస్తున్నారని మనము అనుకొనవచ్చు (నిర్గమ 3:1). అయితే బైబిలు అది కారణము కాదని వివరిస్తుంది. వారి మధ్యన నాయకత్వమును నిర్వహించే విషయములో విబేధములు వచ్చి యున్నవి. సంఖ్యా 11వ అధ్యాయములో 70 మంది నాయకులను ఎన్నిక చేయమని దేవుడు మోషేకు చెప్పెను. ఆ నాయకులు ఆ ప్రజలను నడిపించే విషయములో మోషేకు సహాయపడవలసియున్నది (సంఖ్యా 11:16,17,24,25). ఇశ్రాయేలీయులలో అహరోను మరియు మిర్యాము ప్రధాన నాయకులుగా వారి సేవలను అందిస్తున్నారు (నిర్గమ 4:13-15; మికా 6:4). ఇప్పుడు వారి నాయకత్వమునకు ప్రమాదము ఎదురైనట్లుగా వారు భావించి అహరోను మరియు మిరియాము ఒకరితోనొకరు 'మోషే చేత మాత్రమే యెహోవా పలికించెనా? ఆయన మా చేతను పలికింపలేదా? అని చెప్పుకొనిరి" యెహోవా ఆ మాట వినెను (సంఖ్యా 12:2).

**మిర్యాము అహరోనులు చేసిన ఫిర్యాదుకు దేవుడు ఏవిధముగా జవాబిచ్చెను? సంఖ్యా 12:4-1 చదువుడి. ఇంత శక్తివంతమైన రీతిలో దేవుడు ఎందుకు జవాబిచ్చియున్నాడని మీరనుకుంటున్నారు?**

వారు చేసిన ఫిర్యాదుకు దేవుడు వెంటనే జవాబిచ్చాడు. చర్మవ్యాధియైన కుష్ఠ వ్యాధితో మిర్యామును దేవుడు శిక్షించెను. ఈ చర్మ వ్యాధి ఇతరులకు వ్యాపించకుండు నిమిత్తము ఆ దినములలో వ్యాధిగ్రస్తులను ఏకాంత ప్రదేశాలలో ఒంటరిగా ఉంచేవారు. అవును తన ప్రజలకు దేవుడు అహరోను మిర్యాముల ద్వారా ప్రత్యేక వర్తమానాలను పంపించేవాడు. అయితే ఇక్కడ ఆ వర్తమానములు ఒక వరమువలె మిర్యాము అహరోనులకివ్వబడెనని వారు గుర్తించవలసియుంది. ప్రజల నుండి ఇంకా అధికమైన అధికారము పొందుటకు ఆ వరమును వారొక ఆయుధముగా వాడుకొనకూడదు. ప్రతి విషయములోను దేవుని మీద ఆధారపడాలని మోషేకు తెలుసు కాబట్టి దేవుడు మోషేను ప్రజలను నడిపించే నాయకుడుగా నియమించెను.

అహరోనుకు కుష్ఠ వ్యాధి సోకలేదు. ఒకవేళ వచ్చినచో పరిశుద్ధ గుడారములో సేవ చేయుటకు వీలుండేది కాదు. అయితే మిర్యాముకు వచ్చిన కుష్ఠ వ్యాధి ద్వారా వారి యెడల దేవుడు సంతోషించలేదని తెలియబడుతుంది. ఆమెకు వచ్చిన వ్యాధికి తాను కూడా కారణమనే

పశ్చాత్తాప హృదయముతో తన సహోదరి యొక్క స్వస్థత కొరకు అహరోను ప్రార్ధించెను (సంఖ్యా 12:11). మోషే కూడా తన సోదరి కొరకు ప్రార్ధించెను (సంఖ్యా 12:11-13). మన సహోదరుల యెడల ప్రేమ కలిగి యుండాలని దేవుడు కోరుచున్నాడు.

**నాయకులు పొరపాట్లు చేసినపుడు వారిపై ఫిర్యాదులు చేయుటకు బదులు వారి కొరకు ఎందుకు ప్రార్ధించవలసియున్నాము?**

మంగళవారం జూలై 6

## దేవునికి వ్యతిరేకముగా పోరాటము చేయుట (సంఖ్యా 13:27-33)

ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమి యొక్క ఒడ్డుకు చేరియున్నారు. కానాను దేశములో సంచరించి దానిని గూర్చి తెలుసుకొనుటకు 12 మంది గూఢచారులను (వేగుల వారిని) మోషే పంపించెను. వారు తిరిగి వచ్చి మోషేకిచ్చిన నివేదిక చాలా ఆసక్తికరముగాను, ఆశ్చర్యముగాను ఉన్నది.

**వేగులవారిచ్చిన నివేదికను సంఖ్యా 13:27-33లో చూడుడి. ఆ నివేదికలో ఉన్న ఏ భాగము ఇశ్రాయేలీయులను కలవరమునకు గురిచేసెను?**

ప్రజలు నిరుత్సాహపడి వారి నాయకులపై తిరుగుబాటు చేయకుండా ఉండుటకు కాలేబు తన యావత్ శక్తి ఉపయోగించాడు. అయితే చివరికి అనుమానమును ప్రోత్సహించినవారే ప్రజలను వారి పక్షమునకు త్రిప్పుకోగలిగారు. ఆ చర్య వలన ప్రజలు విశ్వాసమును కోల్పోయారు. అందుచేత వారు విశ్వాసముతో ముందుకు వెళ్ళలేకపోయారు.

మనము దేవుని మీద ఆధరాపడనిచో, విశ్వాసమును కనుపర్చడం సాధ్యము కాదు. అనుమానాలు మన హృదయాలనే కాక మన విశ్వాసమును గాయపర్చును. పరిపూర్ణమైన విశ్రాంతి తీసుకొననిచో మనము తీసుకొనే నిర్ణయాలు లోపముతో కూడినవిగా ఉంటాయని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. అనుమానమనునది కొన్ని ఔషధములను తీసుకొనే అలవాటుకు దారితీస్తుంది. అనుమానము వలన శరీర బరువు పెరిగి అలసినట్లగును. మరియు దుఃఖములోనికి నడిపిస్తుంది.

**సంఖ్యా 14:1-10 చదువుడి. అటు తరువాత ఏమి సంభవించినది?**

పరిస్థితుల యొక్క ప్రభావము వలన ప్రజలు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసారు (సంఖ్యా 14:9) ఆ సమయములో కాలేబు ఎంత ప్రయత్నించినా, రాళ్ళతో నాయకులను కొట్టి చంపుటకు ప్రజలు నిర్ణయించుకున్నారు. ఎవరి హృదయమైతే దేవుని మీద ఆధారపడదో అట్టి వారు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేస్తారు. అట్టి తిరుగుబాటు మరణానికి నడిపిస్తుంది.

పదిమంది గూఢచారులు దేవునియందు నమ్మకము లేనివారు. వారు కాలేబు, యెహోషువాకు వ్యతిరేకముగా మాట్లాడిరి. దేవునికి విధేయులైన ఇద్దరు నాయకులను రాళ్ళతో కొట్టి చంపమని ఒక మూల నుండి ఎవరో కేకలు పెట్టిరి. కాలేబు యెహోషువాను చంపుటకు రాళ్ళను పట్టుకొని ఆ జన సమూహము ముందుకు చొచ్చుకొని వస్తున్నది. అయితే అకస్మాత్తుగా వారి కేకలు వినిపించుటలేదు. రాళ్ళు క్రింద పడుతున్నాయి. అందరూ నిశ్శబ్దముగా మారి భయముతో వణికిరి. ఆ దుర్మార్గపు ప్రణాళికను అడ్డుకొనుటకు దేవుడు తానే స్వయముగా పరిశుద్ధ గుడారములోనికి దిగి వచ్చెను. ఆయన మహిమ అగ్నివలె ప్రకాశించుచున్నది. ఆ వెలుగు గుడారమంతట ఆవరించెను. దేవుని యొద్ద నుండి వచ్చిన ఆ గుర్తును ప్రజలంతా చూసారు. ఇపుడాయన తనను తాను ప్రజలకు కనుపర్చుకొనెను.. దేవునికి వ్యతిరేకముగా పోరాడుటకు ఏ ఒక్కరూ సాహించలేదు. ఆ చెడ్డ గూఢచారులు వారి వారి గుడారాల్లోకి నెమ్మదిగా జారుకున్నారు. -ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 390.

**బుధవారం** **జూలై 7**

## దేవునికిని మరియు పాపులకు మధ్య ఒకడు నిలువబడెను (సంఖ్యా 14:11,12)

ఇశ్రాయేలీయులు దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసినప్పుడు దేవుడు మోషేకిచ్చిన అవకాశమేమిటి? సంఖ్యా 14:11,12 చదువుడి.

ఇశ్రాయేలీయులందరిని ఆ దినమున నాశనము చేసి మోషే ద్వారా మరొక నూతన జనాంగమును తయారు చేయుటకు దేవుడు సిద్దపడెను.

దేవునికిని మరియు తనకును వ్యతిరేకముగా మనుష్యులు తిరుగుబాటు చేసినప్పుడు మోషే ఏమి చేసెను? సంఖ్యా 14:13-19 చదువుడి.

మోషే దేవునికి విధేయుడైన మనిషిగా ఈ వాక్యాలు మనకు చూపిస్తున్నవి. 1400 సం॥ తరువాత యేసును వెంబడించిన వారు ప్రమాదములో ఉన్నపుడు ఆయన చేసినట్టి ప్రార్ధననే మోషే యొక్క సమాధానములో కన్పిస్తున్నది (యోహాను 17) అక్కడ ప్రజల కొరకు మోషే ఏమి చేసెనో అట్టి విషయాన్నే నేడు పరలోకంలో మన కొరకు యేసు చేస్తున్నాడు. మోషే దేవుని యెదుట ప్రజలను సమర్ధించలేదు. వారు దోషము చేసారని అతనికి తెలుసు. అయితే దేవుడు తన ప్రేమను మరియు కృపను చూపుట ద్వారా ప్రజలను క్షమించమని మోషే ప్రాధేయపడ్డాడు (సంఖ్యా 14:19). మోషే యొక్క విన్నపమును బట్టి ఆ దినమున దేవుడు వారిని క్షమించెను. అదే రీతిగా యేసును బట్టి అనగా ఆయన సిలువ మరణము పొంది, మృతులలో నుండి తిరిగి లేచిన దాని బట్టి నేడు దేవుడు మనలను క్షమిస్తున్నాడు.

ఐగుప్తులో నుండి వచ్చినది మొదలుకొని ఇది వరకు నీవు ఈ ప్రజల దోషము పరిహరించియున్నట్లు నీ కృపాతిశయమును బట్టి ఈ ప్రజల దోషమును దయ చేసి క్షమించుమని "మోషే యెహోవాను వేడుకొనెను" (సంఖ్యా 14:19). దేవుని యొక్క కృప మనలను స్వస్థపరచును. దేవుడు మనలను క్షమించినపుడు మన హృదయాలు ఆయనవైపు తిరిగి మనలో ఒక నూతన ఆరంభము మొదలగును.

క్షమాపణ పొందుటకు కొంత వెల చెల్లించవలసియుంది. కృప మరియు క్షమాపణ చౌకగా లభించవు. దేవుడు క్షమిస్తున్నాడు కాబట్టి మన పొరపాట్లుకు మూల్యము చెల్లించనవసరములేదని అనుకొనరాదు. తీసుకొనే చెడు నిర్ణయాలు తరచుగా మనకు మరియు మన ద్వారా ఇతరులకు నొప్పిని కలిగిస్తాయి. అందుచేతనే ఆ గుంపునకు చెందిన ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమిలోనికి ప్రవేశించలేకపోయారు (సంఖ్యా 14:20-23).

అవును మరొక 38 సం॥లు దేవుడు ఇశ్రాయేలీయులను సంరక్షించనైయున్నాడు. దేవుడు వారికి ఆహారాన్ని అనుగ్రహించును. పరిశుద్ధ గుడారములో నుండి వారితో మాట్లాడును. ఎడారిలో వారి వెంబడి ఉంటాడు. అయితే వారందరు మరణిస్తారు. వారి పిల్లలను మాత్రమే దేవుడు వాగ్దాన భూమిలోనికి ప్రవేశింప చేస్తాడని నమ్మవలసియున్నారు.

దేవుడు తన ప్రజలకు వ్యతిరేకముగా తీర్పు తీరుస్తున్నట్లు ఇది కనిపిస్తున్నదా? నిజముగా దేవుడు వారికి తన ప్రేమను కృపను చూపిస్తున్నాడు. దేవుని యందు నమ్మకముంచుట ద్వారా కనానీయులతో పోరాడి జయ మొందారు. చుట్టు ప్రక్కల జనాంగములకు వెలుగైయున్నారు.

గురువారం జూలై 8

## నిజమైన విశ్వాసము లేక అబద్ధ విశ్వాసము (1కొరింథీ 10:1-11)

ఎడారిలో జీవించిన ఇశ్రాయేలీయులతో రెండవ రాకడకు సమీపముగా ఉన్న చివరి కాల ప్రజలతో పోల్చి చూడుడి. వేర్వేరు కాలములలో జీవించిన ప్రజలలో ఉన్న సమానమైన విషయమేమిటి? జవాబు కొరకు 1 కొరింథి 10:1-11 చదువుడి.

బైబిలు కాలములో వాగ్దాన భూమిలోనికి ప్రవేశించుటకు దేవుని ప్రజలు ఎడారి చుట్టూ ప్రయాణించియున్నారు. నేడు కూడా దేవుని ప్రజలు వాగ్దాన భూమిలో ప్రవేశించుటకు ప్రయాణములో ఉన్నారు. అయితే వీరు ప్రయాణించేది నిజమైన ఎడారి గుండా కాదు. ఎడారి అనునది ఒక పద దృశ్యముగా వాడబడినది. దీని ప్రకారము మనము దేవునియందు నిలిచియుండని యెడల మన ఈ నవీన జీవితాలు శూన్యములైయున్నవి.

మనము కూడా ఇశ్రాయేలీయుల వంటి వారమే. తరచుగా మనము కూడా మనకు

విశ్రాంతిని అనుగ్రహించు దేవునియందు నమ్మకముంచుటకు తిరస్కరిస్తూ ఉంటాము. మనము శాంతి కొరకు వెదుకుతూఉంటాము. అయితే దానిని మనము తప్పుడు స్థలాలలో కనుగొనుటకు ప్రయత్నిస్తూ ఉంటాము.

దేవుడు ఇశ్రాయేలీయులను తీర్పు తీర్చినపుడు వారు ఏవిధంగా ప్రవర్తించారో సంఖ్యా 14:39–45లో ఏమి చూడగలము?

“మేము పాపము చేసినవారము. మేము యెహోవాను నమ్మలేదు. అందుకు చింతించుచున్నాము. దేవుడు వాగ్దానము చేసిన ఆ దేశములోనికి మేము ఇపుడు వెళ్ళెదము” అని ఇశ్రాయేలీయులు చెప్పిరి (సంఖ్యా 14:40) అదే అధ్యాయము చివరి రెండు వచనాలలో ఇశ్రాయేలీయులు దేవుడు వారికిచ్చిన నూతన ప్రణాళికను తిరస్కరించారు. తరువాత ఏమి సంభవించినది? చివరికి దేవుని యొక్క ప్రజలకు నిరుత్సాహము మరియు మరణము ఎదురయ్యింది. ప్రజలు చాలా మూర్ఖముగా ప్రవర్తించారు. నిబంధన మందసమును వారి వెంబడి తీసుకొని వెళ్ళకుండా యుద్ధానికి బయలుదేరారు. వారి వెంబడి మోషే కూడా వెళ్ళలేదు. వారి హృదయాలలో దేవుడు కాపాడగలడనే అబద్ధపు విశ్వాసముతో యుద్ధానికి వెళ్ళారు. ఇదొక తీవ్రమైన పాపము.

దేవుడు వాగ్దానము చేయని దానిని మనకిస్తాడని నమ్ముట ద్వారా ప్రమాదములో పడుతున్నాము. ఈ పాపము మనలను మరణమునకు నడిపిస్తుంది. మనము భయపడవలసినప్పుడు భయపడకుండా ముందుకు సాగిపోవుట వలన మరణము సంభవించవచ్చును. మనము దేవుని యందు నమ్మకముంచి ఆయన నడిపింపు కొరకు వేచి యుండాలి. అలా కానిచో చివరి ఫలితాలు విచారకరముగా ఉంటాయి.

మీరు విశ్వాసముతో పని చేసిన సంఘటనను గూర్చి ఆలోచించుడి. ఇప్పుడు దేవుని ప్రణాళికల మీద ఆధారపడకుండా సొంత బలము మీద ఆధారపడి చేసిన పనిని గూర్చి ఆలోచించండి. ఈ రెండు అనుభవాలు ఏ విధముగా వేర్వేరుగా ఉన్నవి?

**శుక్రవారం** **జూలై 9**

## అదనపు అధ్యయనము

“ఇశ్రాయేలీయులు వారి పాపాల విషయమై చింతించియున్నారు. అయితే వారి హృదయాలలో నిజమైన విచారము లేదు. వారి పాపము తీసుకొని వచ్చిన ఫలితమును గూర్చి వారు చింతించియున్నారు. దేవునికి అవిధేయత చూపినందుకు పశ్చాత్తాపము చెందలేదు. అందుచేత దేవుడు వారికొక పరీక్ష పెట్టాడు. వారి శత్రువుల భూభాగములో నుండి వెనుకకు తిరిగి విధేయత చూపించక వారి భావాలు వారిని స్వాధీనపర్చుకునే స్థితిలోనికి వెళ్ళిపోయారు. వారు చేసిన పాపమువలన తీవ్రమైన పరిమాణాలను

ఎదుర్కొనవలసి వచ్చింది" ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు పుట 391.

"దేవుడు వాగ్దానము చేయనిది మనకు ఆయనే ఇస్తాడనుకొనుట అబద్ధ విశ్వాసమునకు సమానము. మనకు నిజమైన విశ్వాసముండాలి. అప్పుడు దేవుని కాపుదల మనకుంటుంది. నిజమైన విశ్వాసము దేవునికి విధేయత చూపేదై యుంటుంది. మనతో పాపము చేయించుటకు దేవుడిచ్చిన వాగ్దానములను సాతాను ఉపయోగించుకుంటాడు. దేవుని ప్రేమను శంకించుట వలన ఆదామవ్వలు పాపము చేసారు. వారు అబద్ధ విశ్వాసము కలిగి యున్నారు. నిజమైన విశ్వాసము బైబిలులోని వాగ్దానములతో ఆరంభమై మనము ఏమి చేయాలని బైబిలు కోరుతుందో దాని ప్రకారము మనము నడుచుకుంటాము" –ఎలెన్ జి వైట్, యుగయుగాల ఆకాంక్ష, పుట 126.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. నిజమైన బైబిలు విశ్వాసమునకు మరియు అబద్ధ విశ్వాసమునకున్న తేడా ఏమిటి? ఈ రెండు కూడా ఏవిధంగా వేర్వేరు కోణాలకు చెందినవి? దేవుడు ఇశ్రాయేలీయులను కనానీయులతో యుద్ధము చేయవద్దని చెప్పినపుడు వారు ఆయన మాట వినకుండా యుద్ధానికి వెళ్ళారు. యుద్ధానికి వెళ్ళమని చెప్పినపుడు తిరుగుబాటు చేసారు. ఈ రెండింటిలో ఏ చర్య నిజమైన విశ్వాసమునకు చెందినది. ఏ చర్య అబద్ధ విశ్వాసానికి చెందినది?
2. పాపము శ్రమలకు నడిపిస్తుంది. అవును మనకు క్షమాపణ దొరుకుతుంది. అయితే పాపము చేయుట ద్వారా వచ్చిన ఫలితాలను అనుభవించి తీరాలి. గతములో చేసిన పాపమును దేవుడు క్షమిస్తాడని నమ్ముటకు కొందరికి కష్టము. అవును అది నిజమే. ఒకవేళ ఆ పాపము యొక్క ఫలితము ఇప్పటికి వెంటాడుచున్నచో ఆ పాపాన్ని దేవుడు క్షమించలేదనిపిస్తుంది. ఇట్టి సమస్య కలిగిన వారికి మీరెట్లు సహాయపడగలరు?

❋✶❋